


— మహర్షి

అలా బోర్లా పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నావేమిత్రా? చిన్నారావ్! నీ గర్ల్‌ఫ్రెండ్ ఛీ కొట్టిం.. లేక ఏ ముసలిదైనా కన్ను కొట్టిం..? అదీ కాకుంటే బస్‌లో ఎవరైనా జేబు ఖా.. చేశారా? వెధవ సస్పెన్స్‌తో చంపక చెప్పరా బాబూ!" కుదిపి మరీ అడిగాడు లింగారావు.

చిన్నారావు లింగారావు రూంమేట్. ఇద్దరు ముచ్చటగా ఒకే స్టౌమీద వండుకుని, ఒకే కంచంలో తినకపోయినా, ఒకే చాపమీద పడుకుంటున్నారు. లింగారావును చూసిన చిన్నారావు గబుక్కున లేచి చటుక్కున వాటేసుకుని బావురుమని ఏడ్చాడు. లింగా రావు భయపడిపోయాడు ఏంజరిగిందోనని.

"ఏమిత్రా చిన్నారావ్! ఎవరైనా పోయారా ఏమిటి?". అనుమానంగా అడిగాడు. చిన్నారావ్ జేబులోని లెటరు తీసి లింగారావుకు అందించి టవల్ తీసి మొహాన కప్పుకుని మరో సారి బావురుమన్నాడు.

లింగారావు గబగబా లెటరు విప్పాడు. "చిన్నోడు చిన్నారావును మీ అమ్మ సంగీత సామ్రాజ్యాధినేత దీవించి వ్రాయునది. నువ్వు వేళకు తిని, వేళకు నిద్రపోతున్నావా లేదా? ఆ లింగారావు నీకు సరిగ్గా వండిపెడుతున్నాడో లేదోనని బెంగగా వున్నది. నీకు చాలా పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. మీ నాన్న తొందరపడుతున్నారు. నాకు ఒక్కటి కూడా నచ్చడం లేదు. నాకొచ్చే కోడలు నా అంత సంగీత విద్వాంసురాలయితే తప్ప నే ఒప్పుకోనని తెగేసి చెప్పాను. మీ నాన్న పెదవి విరుస్తున్నారు. అయినా నేను లెక్క చేయడం లేదు. నువ్వు అక్కడ తొందరపడి ప్రేమ వంకాయ కూడా అంటూ తిరిగితే తరువాత నా శవంమీదపడి ఏడవాల్సి వుంటుంది. నేనీ మధ్య కొన్ని కృతులు సాధనచేసి రికార్డు చేశాను. శ్రద్ధగా విని ఎలా వున్నాయే తెలియచేయి. నీవు ఈసారి ఇంటికి వచ్చేటప్పటికి మరిన్ని కృతులు పాడి రికార్డు చేస్తాను. నువ్వు పెళ్ళి గురించి బెంగపెట్టుకోకు. సాంప్రదాయబద్ధమైన సంగీతం వచ్చిన అమ్మాయినే నీకు చేస్తాను.

ఇట్లు
మీ అమ్మ సంగీత

లింగారావు "అహా.. నీ అంత అదృష్టవంతుడు ఈ దేశంలోనే లేడంటే నమ్ము. మీ అమ్మకు నువ్వంటే ఎంత ప్రేమ! మీ ఇంట్లోనేమో పెళ్ళి చేయాలని ఒకటే తొందర. నాకేమో పెళ్ళి చేయిండ్రాబాబోయ్ అంటే మక్కిలిరగ తంతా అంటున్నారు. ఎంతయినా పెట్టి పుట్టావురా చిన్నారావ్!" చెప్పాడు లింగారావు.

"నీ మొహం మండ. నిన్ను బొందలోపెట్ట. నా అదృష్టం గురించేనా అలా పొంగిపోతున్నావ్! ఈ క్యాసెట్‌లోని పాట విను నీ రోగం కుదురుతుంది" అని చిన్నారావ్ కళ్ళు

# సంగీతం

తుడుచుకుని గబుక్కున లేచి చకచకా టేప్ రికార్డు ఆన్ చేశాడు.

లింగారావు ఆతృతగా ఎదురుచూస్తున్నాడు.

కిచ్...కిచ్....చిక్...చిక్.... కిర్... కిర్.... బర్.... బర్.... మని శబ్దాలు చేసి పాట మొదలయింది.

"చిన్నరాయుడిగారి పెద్ద పెళ్ళాం... పెద్ద రాయుడిగారి చిన్న పెళ్ళాం... సవతులే సవతులు.. మాయదారి కాలం... పిగ్గులేని రోగం... చిన్నరాయుడిగారి పెద్ద.... లింగారావు టక్కున ఆఫ్ చేసి "ఇదేం పాటరా బాబు! మరీ కర్ణకటోరంగా వుంది. నాకు వాంతి వచ్చేలా వుంది. ఇదే నాకు అమ్మ పాడిన పాట?" అడుగాడు.

"అప్పుడే ఏం అయింది. రెండవది విను" అని కొంచెం ఫార్వర్డ్ చేసి ఆన్ చేశాడు చిన్నారావు.

"చల్లచేయి గొల్లభామా నడ్డి తిప్పు ముసలి భామా

వెన్నతీయి వెర్రి భామా.. పాలు పితుకు పిచ్చి భామా..."

లింగారావు గబుక్కున ఆఫ్‌చేసి "వాంతి వచ్చేస్తోందిరా చిన్నారావు! ఇంతకాలం ఎలా భరించావురా!" బాధగా అడిగాడు.

"ఏం చేయమంటావురా! విధి వంచనకు తల వంచక తప్పలేదు"

"ఐ.పి.టి.యు చిన్నారావ్! మరి మీ నాన్న ఎలా భరిస్తున్నాడంటావ్!" అనుమానంగా అడిగాడు లింగారావు.

"ఆయన బాధ వర్ణనాతీతం. మా అమ్మ బాధపడలేక చుట్టు ప్రక్కలవాళ్ళ గొడవలు పడలేక మూడు నెలలకొకసారి ఇల్లు మారాల్సి వస్తున్నది. పాపం ఆ దిగులుతోనే దున్నలాంటివాడు సన్నగా మారిపోయాడు" చెప్పి కళ్ళు వత్తుకున్నాడు చిన్నారావ్.

"అయితే నీకు సంగీతం వచ్చిన అమ్మాయిని చేసుకోక తప్పదన్నమాట." విచారం వ్యక్తం చేశాడు లింగారావు.

"చంపుతాను వెధవ అలాంటి కుళ్ళు జోకువేశావంటే" కమ్ మన్నాడు చిన్నారావు.

"పోనీ నీ గర్ల్ ఫ్రెండ్‌ను సంగీతం నేర్చుకోమను" ఓ ఉచిత సలహా యిచ్చాడు లింగారావు.

"వద్దురా బాబూ! ఆ సంగీతం పేరు చెబితేనే ఆమె ఆమడదూరం పారిపోతుంది. అయినా అలాంటి సంగీతం నేను భరించలేను. నేను అనుభవించిన నరకం గురించి చెబుతాను విను. ఒక్కరోజు మా ఇంట్లో జరిగే సంగీత భాగోతం విందాం అలా ఫ్లాష్‌బ్యాక్‌లోనికి పద." అంటూ చిన్నారావు మొదలెట్టాడు.

"ఏవండోయ్! లేవండి లేవండి. మీ మొద్దు నిద్రపోడు కాను. కాస్త లేచి అలా బయటికెళ్ళి చూసిరండి చుట్టుప్రక్కల జనం గగ్గోలు పెట్టి పీడిస్తున్నారు. తొందరగా లేవండి" గబ గబా కుదిపి లేపింది సంగీత భర్తను.

నిద్రనుండి ఉలిక్కిపడిన గరగారావు లుంగి సరిచేసుకుంటూ కంగారుగా వీధిలోనికి పరుగెత్తాడు. సంగీత గడపలో నిలబడింది.

అయిదు నిముషాలలో గరగారావు మొహం వేళ్ళాడేసుకుని వచ్చాడు. వస్తూనే భార్యను ఇంట్లోనికి లాక్కెళ్ళి "నీ సంగీత సాధన నాశనం కాను. ఇంత ఉదయాన్నే నీ గళమెత్తి పాడాలా? నీ గొంతు విని చుట్టుప్రక్కల చిన్న పిల్లలు నిద్రలో ఉలిక్కిపడి లేచి గుక్కపెట్టి ఏడుస్తున్నారట. వాళ్ళను సముదాయించలేక పెద్దవాళ్ళు కూడా ఏడుస్తున్నారు. నన్ను చివాట్లు వేశారు. నువ్వు బయటకొస్తే తన్నటానికి రడీగా వున్నారు. నీ గొంతు కోస్తానని

ఒకామె చిందులు వేస్తున్నది" వగరుస్తూ చెప్పాడు.

"సర్లెండి. వాళ్ళెవరికీ సంగీతం రాదు కదా! అందుకే నా సంగీతం విని కుళ్ళు అయినా ఉదయాన్నే అయితే గాత్రం బాగుంటుందని ఓ కృతికూడా పూర్తి చేయలేదు. అయినా నా సంగీతానికి ఏంటట?" సాగదీసింది సంగీత.

"సరి సరి. నీ సంగీతం నీకే నచ్చుతుంది. నిన్ను కట్టుకున్నందుకు నాకే నచ్చుతుంది. అంతే కానీ అందరికీ నచ్చాలని లేదు. తలుపులు బిగించి అద్దం ముందు కూర్చుని పాడుకో భయ ఎడి చచ్చారనుకుంటావ్!" తల బాదుకున్నాడు గరగారావు.

"అయినా పెళ్ళి చూపులనాడు మా నాయినమ్మ చెప్పనే చెప్పింది ఆ మొహం చూస్తుంటే సంగీతప్రియుడివలె లేడు అని నేను వింటేనా?" సంగీత ముక్కు బిర్రున చీదింది




"అదిగో అదిగో ఆ ఫ్లాష్ బ్యాక్‌కే వద్దంటాను. ఎందుకే ఈ సంగీతం నీకు. నీ సంగీతం బాధ పడలేక మనమ్మాయి పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళి మళ్ళీ పుట్టింటి మొహం కూడా చూడలేదు. అబ్బాయి ఉద్యోగం వచ్చి పట్నం వెళ్ళి నీ సంగీతం ఆపితేకానీ ఇంటికి రానని మొరాయించాడు. నీ సంగీతం ఆపవే సంగీతం గడ్డం పట్టుకుని బ్రతిమాలాడు గరగారావు.

"సంగీతం అందరికీ వస్తుందాండీ! పుట్టిన వెంటనే నా ఏడుపు విని ఇది సంగీతంలో పండితురాలవుతోందని మా నాన్న నాకు సంగీత అని పెట్టారట. సంగీతం వరప్రసాదమండీ! ఆ భగవంతుడేనా నాలుకమీద వీణతో గీకాడండి" గబగబా హార్మోనియం పెట్టెను భక్తిగా నమస్కరించింది సంగీత.

"ముద్దెట్టమ్మా! ముద్దెట్టు తల్లీ!" బయట ముష్టివాడు అరుస్తున్నాడు. గరగారావు చకచకా బయటకొచ్చి చురచురా చూస్తూ

"ఏరా ముష్టి వెధవ! ఆ డబుల్ మీనింగ్ మాటలేంటిరా? కాళ్ళు విరగ్గొడతాను, జుట్టు పీకుతాను, గొంతు నలిపేస్తాను" గబగబా తిట్టాడు.

"మీరనేదేంటో నాకేం తెల్వదండి. అమ్మా ముద్దెట్టు తల్లీ!"

"మీ అమ్మగారు ఇవాళ బయటకు రాదు. ఇది తీసుకెళ్ళు" అంటూ ఓ పావలా అందివ్వబోయాడు గరగారావు.

"నాకేం వద్దు. అమ్మగారే యివ్వాలి." వాడు మంకుపట్టు పట్టాడు.

"ఈ రోజు ఆమె బయటకు రాదురా!" చెప్పాడు గరగారావు.

"ఎందుకు రాదు. వచ్చి తీరాల్సిందే."

"రాదురా బాబూ! బయటకొస్తే బడితపూజ చేయటానికి చుట్టు ప్రక్కలవాళ్ళు కాచుక్కూర్చున్నారు."

"అయినా సరే ఆమె రావాల్సిందే ఒక పాట పాడాల్సిందే. ఆమె పాట వినక పోతే నాకళ్ళు కదలవు. అమ్మా! ఓ పాటైనా పాడు తల్లీ!" ముష్టివాడు గొంతెత్తి అరిచాడు. అంతే! సంగీత గడపలో ప్రత్యక్షమై ఓ పాట అందుకున్నది. ముష్టివాడు ఆనందంతో మైమరచిపోయాడు. సంగీత మురిసిపోయింది.

అలా వుంటుందిరా మా ఇంటి సంగతి. అలాంటి ఇంట్లో నేను ఎలా వుండగలను. నేను సంగీతం వచ్చిన అమ్మాయిని చేసుకోవాలని అమ్మ పట్టుదల. బాధగా చెప్పాడు చిన్నారావ్.

"అయితే నాకో బ్రహ్మాండమైన అయిడియా తట్టింది చెప్పమంటావా?" అడిగాడు లింగారావు.

"అర్జంటుగా చెప్పి పుణ్యం కట్టుకోరా బాబూ!" బ్రతిమాలాడు చిన్నారావ్.

"వజ్రాన్ని వజ్రంతోనే కోయాలంటారు. ముల్లును ముల్లుతోనే తీయాలంటారు. అయితే నువ్వు సంగీతం వచ్చిన అమ్మాయిని చేసుకుంటే మీ అమ్మ నోటికి తాళం పడుతుంది. నీకు మనశ్శాంతి మిగులుతుంది. ఏమంటావ్!" చప్పట్లు చరిచాడు లింగారావు చెప్పడం ఆపి.

"చంపుతాను దరిద్రపుగొట్టు వెధవ. నీదో బుర్ర, అందులో గొప్ప అయిడియానా! ఇలాంటి దిక్కుమాలిన సలహాలు ఎవరికీ యివ్వకు చెత్తారేక్కొడతారు. నీ సలహా ప్రకారం నేను చేస్తే రేపు ఇద్దరు కలసి సంగీతం, సంగీతం అంటూ వీధినపడితే నేను కాషాయ బట్ట కట్టుకుని పాటలు పాడుకుంటూ జనంమీద పడాల్సివుంటుంది" బావురుమని ఏడ్చాడు చిన్నారావు.

## విషపు జంతువుల వల్ల గాయాలకు ప్రథమ చికిత్స

### కుక్క కరిచినప్పుడు:

ముందుగా కరిచిన కుక్క మంచిదా, పిచ్చిదా అని గుర్తించాలి. కరిచిన తర్వాత వారం, పదిరోజుల లోపు కుక్క చనిపోయిన లేక కరిచిన కుక్క కనిపించ గుర్తించలేకపోయినా, కరిచినది పిచ్చి కుక్కగానే భావించి వైద్యం మొదలు పెట్టాలి.

### కుక్క మంచిదా పిచ్చిదా అని గుర్తుపట్టుట:

సరిగా అన్నం తినక నోటి వెంట అదేపనిగా చొంగ కారుస్తూ, ఒక చోట నిలవక అటూ ఇటూ బిత్తరి చూపులు చూస్తూ తిరిగే కుక్కను పిచ్చికుక్కగా భావించాలి.

ముందుగా కరిచిని గాయాన్ని స్వచ్ఛమైన నీటితో శుభ్రంగా కడిగి, డెట్టాల్ అద్దిన దూదితో గాయాన్ని తుడిచి టి.టి. ఇంజక్షన్ చేయించుకోవాలి. పిచ్చికుక్క కరిచినట్లయితే "యాంటీ రేబిస్" ఇంజక్షనులు చేయించుకోవాలి.

### పాము కాటువలన:

పాము కాటువేసినప్పుడు దాని విషం వల్ల కాక, భయంవల్ల మనకు జరిగే నష్టం ఎక్కువ. ఎందువలనంటే, మన దేశంలో సంచరించే పాములలో 80 రకాల పాములు విషం లేనటువంటివిగా చెప్పవచ్చు.

### పాము కాటుకు గురైన వ్యక్తి లక్షణాలు

౧. నోటి వెంట నురుగు కారుతూ, ఊపిరి అందకపోవటం.

2. కాళ్ళు, చేతులు తేలిపోతూ, కండరాలు చచ్చుపడిపోవటం.

3. వికారముగా ఉండి వాంతులు అవ్వటం.

### చికిత్స:

సాధ్యమైనంత వరకు రోగిని కదలకుండా వుండేటట్లు చూడాలి. కరిచిన చోట, డెట్టాల్ నీటితో గాయాన్ని శుభ్రంగా కడగాలి. ఊపిరి కష్టంగా పీల్చుకొంటుంటే నోటిలో నోరు పెట్టి ఊదటం వల్లగాని వేరే విధంగా గాని శ్వాస ఆడేటట్లు చూడాలి. మంత్రాలని, నాటు పసర్లని కాలయాపన చేయటం వల్ల ప్రయోజనమేమి లేకపోగా, ప్రాణాపాయం సంభవించవచ్చు. వెంటనే డాక్టరుని సంప్రదించటం మంచిది.

డి.వి.యల్. నరేంద్ర